
సాక్షి
చిత్తూరు

బుధవారం । 25 । జూన్ । 2025



నువ్వు నిర్మించుకో!

పలమనేరు మున్సిపాలిటీలో పరిస్థితి దారుణంగా తయారైంది. రాత్రికి రాత్రే ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. - 8లో



వండి పెట్టేయండి

అంగన్‌వాడీలకు ఇచ్చే కంది పప్పు నాసిరకంగా ఉంటోంది. అయినా అధికారులు వండిపెట్టేయాలని చెబుతున్నారు. - 8లో



ధరలు చెప్పం!

మొన్నటిదాకా కిలో తోతాపురి రూ.8, రూ.5 అంటూ ఊదరగొట్టిన ఫ్యాక్టరీ యజమానులు ఇప్పుడు ధరలు చెప్పడం లేదు. - 8లో

న్యూస్‌రీల్

పోటీలు నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తల్లి పాత్ర సహకారం అనే అంశంపై పోటీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 28 వరకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు.

భోజనం సకాలంలో అందుతుందా?



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుడిపాల: సమస్యలు ఏమైనా పరిష్కారమయ్యాయా..? భోజనం సకాలంలో అందుతుందా..? అంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఆయన గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, తాసా మామిడి గుజ్జు పరిశ్రమలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతుల వద్దకు వెళ్లి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సకాలంలో అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ముందుగా వచ్చిన రైతులకు ముందుగా టోకెన్లు జారీ చేయాలన్న నిబంధన పాటించాలని మామిడి గుజ్జు పరిశ్రమ వారిని ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.4 మద్దతు ధరను డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మి ఉన్నారు.

టమాట ధరలకు రెక్కలు



వడ్డిపల్లి మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: టమాట ధరలకు రెక్కలొచ్చాయి. పలమనేరు మార్కెట్లో 15కిలోల బాక్సు మంగళవారం రూ.350 దాకా పలికింది. పొరుగునే ఉన్న కర్ణాటకలోని వడ్డిపల్లి మార్కెట్లో రూ.400 దాకా పెరిగింది. వర్షాల కారణంగా సరుకు నాణ్యత తగ్గింది. దీనికి తోడు సీజన్ ముగిసిపోతుండడంతో దిగుబడి తగ్గుతోంది. ఫలితంగా టమాట రేట్లు పెరుగుతున్నాయి.

జూలై నుంచి ఆశాజనకంగా ధరలు

ఇలా ఉండగా జూలై తొలి వారంలో కోతకొచ్చే తోటలకు ధరలు ఆశాజనంగా ఉంటాయని ఇక్కడి వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి దాకా ఉన్న తోటలు ఈనెల ఆఖరుకల్లా వడిగిపోతాయి. ఆపై కొత్త తోటలు కోతకు రావడంతో డిమాండ్ పెరిగి ధరలు ఆశాజనకంగా ఉంటాయని చెబుతున్నారు. దీంతోపాటు పలు రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంటుందనే మాట వినిపిస్తోంది.

విద్యాహక్కు అపహాస్యం

విద్యాహక్కు చట్టం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అపహాస్యం పాలవుతోంది. ఈ చట్టం మేరకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలో పేద పిల్లలకు 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఆదేశాలు, విద్యాహక్కు చట్టం నిబంధనలను యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు నోరు మెదపడం లేదు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకునే అధికారం ఉన్నా ఆ అధికారాన్ని వినియోగించకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్టీఈని పకడ్బందీగా అమలు చేశారని తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటుండడం గమనార్హం.



- జిల్లాలో మొక్కుబడిగా ఆర్టీఈ అడ్మిషన్లు
- పర్యవేక్షించే నాథుడే కరువు
- చిత్తూరు, తిరుపతి జిల్లాలో 3,978 సీట్లు కేటాయింపు
- ఆమోదించిన సీట్లు 10శాతం లోపే
- చట్టం ఆదేశాలు పట్టించుకోని యాజమాన్యాలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో పక్కాగా ఆర్టీఈ అమలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో ఈ చట్టం కచ్చితంగా అమలు చేయాల్సి ఉంది. అయితే రెండు జిల్లాల్లో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. స్కూళ్లు ప్రారంభించిన వెంటనే ఆర్టీఈ (విద్యాహక్కు చట్టం) కింద ఒకటో తరగతి అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన అనంతరం ఆన్‌లైన్ లాటరీ విధానంలో విద్యార్థులకు పలు పాఠశాలల్లో ప్రవేశాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రవేశాల పత్రాలను తల్లిదండ్రులు తీసుకెళ్లి పాఠశాలల్లో ఇస్తుంటే అడ్మిషన్లు ఇచ్చేది లేదంటూ తిరిగి పంపించేస్తున్నారు. ఇదేమిటి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయరెందుకు అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే....తమకు ఆర్టీఈ అడ్మిషన్ల జాబితానే ఇవ్వలేదంటూ పాఠశాలల నిర్వాహకులు సమాధానమిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3978 సీట్లు కేటాయిస్తే అందులో 10 శాతం సీట్లను సైతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు చేసుకోని దుస్థితి నెలకొంది.

వివరాలు గోప్యం?

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు తప్పనిసరిగా విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు ఇవ్వాలి. ఆర్టీఈ ద్వారా కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ చేపడుతున్నా.. వాటి వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతోంది. ఏటా అడ్మిషన్ల సమయంలో హడావుడి చేసే విద్యాశాఖ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాల వారీగా ఏయే పాఠశాలలో ఎన్ని ప్రవేశాలు కల్పించారనే వివరాలను మాత్రం వెల్లడించడం లేదు. ఇప్పటి వరకు ఆర్టీఈ ద్వారా కల్పించిన వివరాలు విద్యాశాఖ బయట పెట్టలేదు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఒత్తిడితోనే వివరాలు బయటపెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఉచితమైనా లాగేస్తున్నారు..

చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తే పదో తరగతి వరకూ ఆ వెసులుబాటు ఉంటుంది. ఇవాళ ప్రైవేటు/ కార్పొరేటు పాఠశాలల్లో చూస్తే ఒకటో తరగతికి రూ.లక్ష లాగేస్తున్నారు. వాస్తవంగా లెక్కలు వేస్తే పాక్షిక ఉచితమనే విషయం బోధపడుతుంది. బస్సు, పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టు, బిల్డింగ్ ఫండ్, స్పెషల్ ఫీజు, ఐఐటీ, నీట్ ఇలా రకరకాల బాదుడు మామూలే. ఈ డబ్బులు ఆయా తల్లిదండ్రులు చెల్లించాల్సిందే. కేవలం ట్యూషన్ ఫీజులో మాత్రమే ఉచితం కాదుగానీ రాయితీ ఇస్తున్నారు. అయినప్పటికీ ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లు అనగానే యాజమాన్యాలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకొనే అవకాశం విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రైవేట్ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	166	31,922
ప్రాథమికోన్నత	79	11,750
ఉన్నత	159	29,303
ప్రాథమిక, హైస్కూల్	18	6,074
ప్రాథమిక, హైస్కూల్ ప్లస్	06	5,929
జూనియర్ కళాశాలలు	66	19,327
మొత్తం పాఠశాలలు	2,984	2,60,641

ఆదేశాలు బేఖాతరు

విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రభుత్వమే ఆన్‌లైన్ ద్వారా సీట్లు కేటాయిస్తుంది. దీనిని ఉల్లంఘిస్తే సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయనట్టే. దీనిపై తీవ్రమైన చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. స్కూల్ అనుమతి రద్దు చేయడం జరుగుతుంది. అయితే పేదల సీట్ల విషయంలో అధికారులు ప్రైవేటు/ కార్పొరేటు స్కూళ్లను బతిమలాడుకోవాల్సి వస్తోంది.

ఆర్టీఈ ప్రవేశాలు పకడ్బందీగా అమలు చేయాలి



ఆర్టీఈ అడ్మిషన్లు ఖరారు అయినప్పటికీ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తమకు ఏ మాత్రం సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమస్యను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం స్పందించడం లేదు. ఫలితంగా నిత్యం తల్లిదండ్రులు విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు తప్ప న్యాయం మాత్రం జరగడం లేదు. చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు ఆర్టీఈ ప్రవేశాలను పకడ్బందీగా అమలు చేయాలి.

– ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, చిత్తూరు జిల్లా

ఎగ్గొటేందుకు ఎత్తుగడ

వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్టీఈ అడ్మిషన్లను పకడ్బందీగా అమలు చేశారు. ప్రస్తుత కూటమి సర్కారు ఆర్టీఈ ప్రవేశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు సీట్లు కల్పించడానికి ఏటా వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈ ఏడాది మే 27 నుంచి జూన్ 9 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. రెండో దశ, మూడో దశ కూడా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. ఆరు దశల వడపోత తర్వాత పాఠశాలలను కేటాయిస్తారు. ఇలా కేటాయించిన తర్వాత సదరు స్కూల్‌కు విద్యార్థిని తీసుకొని తల్లిదండ్రులు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలి. ఈ దశలోనే విద్యార్థుల తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్నారు. కాస్త గట్టిగా నిలదీస్తే పని జరుగుతుంది. లేదంటే అంతే. ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లను సమగ్ర శిక్షా (ఎస్ఎ/ ఎస్ఎస్ఎ) చూసుకుంటోంది. సదరు అధికారులను స్కూలు యాజమాన్యాలు బురిడీ కొట్టిస్తున్నాయి.

విద్యాశాఖ అధికారులకే స్పష్టత కరువు

ఆర్టీఈ అడ్మిషన్ల ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులకే స్పష్టత లేని దుస్థితి. ఈ చట్టం ద్వారా ఎంత మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారనే విషయంపై అధికారులు స్పష్టత లేదు. నిత్యం వందల మంది తల్లిదండ్రులు ఆర్టీఈ అడ్మిషన్ల విషయంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన ఉండటం లేదు. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విద్యార్థులు ఆర్టీఈ ప్రవేశాలు పొందినప్పటికీ తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఒకటో తరగతిలో జాయిన్ చేసుకున్న చిత్తూరు నగరంలోని ఓ ప్రముఖ కిడ్స్ పాఠశాల.. ఈ ఏడాది మాత్రం ఏకంగా తమ స్కూల్‌లో ఒకటి, రెండు తరగతులు నిలిపివేశామని సెలవిచ్చింది. దీంతో ఆన్‌లైన్‌లో కేటాయింపు జరిగిన 18 మంది పిల్లల అడ్మిషన్లు అయోమయంలో పడ్డాయి. రెండు జిల్లాల్లో ఇలాంటి సమస్యలు మరెన్నో ఉన్నట్లు తెలుస్తోంది.

ఊరిలోని బడి కోసం పోరాటం



ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పాలమాకులపల్లెవాసులు

పలమనేరు : తమ గ్రామంలోనే బడి ఉండాలని, పక్క ఊరికి మారిస్తే పిల్లలను పంపే ప్రసక్తే లేదని, ఇందుకోసం పోరాటం కొనసాగిస్తామని మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ పాలమాకులపల్లె వాసులు స్పష్టం చేశారు. మంగళవారం ఈమేరకు పలమనేరు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మా గ్రామంలోని బడిలో 30మంది పిల్లలున్నారన్నారు. ఎర్రగొండేపల్లె, కురప్పల్లె, జల్లిక్వారీ, హోచరీ ప్రాంతాలనుంచి ఇక్కడికే విద్యార్థులు వస్తున్నారని తెలిపారు. అయితే ఈ బడిలోని 3,4,5 తరగతుల పిల్లలను దిగువ కల్లాడు పాఠశాలకు పంపాలంటే ఇబ్బందులు తలెత్తుతాయని వెల్లడించారు. ఆ మార్గంలో నిత్యం టిప్పర్లు వేగంగా వెళుతుంటాయని, దీంతో పిల్లలకు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎక్స్‌ప్రెస్ హైవే పనుల వద్ద బ్లాస్టింగ్‌లు జరుగుతుంటాయని వాపోయారు. అలాగే రోడ్డు పక్కనే చెరువులా వరదనీరుందని అందులో పిల్లలు పడిపోతే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని మా గ్రామంలోని బడిని మార్చవద్దని కోరారు. దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల



ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 5వ ర్యాంకు సాధించిన విజయ్‌వర్మ

తిరుపతి సిటీ: ఆంధ్ర యూనివర్సిటీ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఏపీపీజీఈసెట్–2025 ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సులో 13 పీజీ సబ్జెక్టుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ఏపీపీజీసెట్‌కు ఎస్వీయూ రీజియన్ నుంచి 3,946 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రవేశ పరీక్షకు 3,434మంది హాజరయ్యారు. వీరిలో 3,208 మంది ఉత్తీర్ణత సాధించారు. జీఈఓ ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫోమ్యాటిక్స్ విభాగంలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన టి. సుధాకర్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించగా, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో తిరుపతికి చెందిన విజయ్‌వర్మ 5వ ర్యాంకు సాధించాడు.

నేడు కరికులంపై ప్రాంతీయ వర్క్‌షాప్

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా బోర్డు (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ డిప్లొమో కరికులంపై తిరుపతిలోని గోల్డెన్ తులీప్ హోటల్‌లో బుధవారం ప్రాంతీయ వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు సాంకేతిక విద్య డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి జీవీవీఎస్.మూర్తి, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏవీ.రామకృష్ణ, డెప్యూటీ కార్యదర్శి డాక్టర్ కె.లక్ష్మీపతి హాజరవుతారని, ఈ వర్క్‌షాప్‌లో పలువురు పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, టీచర్లు పాల్గొని పాలిటెక్నిక్ డిప్లొమో విద్యార్థులకు అవసరమైన సిలబస్ తయారీపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

అగ్రికల్చర్ డిప్లొమా ప్రవేశాలకు 30 వరకు గడువు

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2025–26 విద్యాసంవత్సరానికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడుపు ఈనెల 30 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుమతి ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 16తో ప్రవేశాల గడువు ముగిసిందని, విద్యార్థుల సౌకర్యార్థం నెలాఖరు వరకు గడువు పెంచినట్లు చెప్పారు. అగ్రికల్చర్, ఆర్గానిక్, సీడ్ టెక్నాలజీ, అగ్రి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని, పదోతరగతిలో పొందిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలియజేశారు.

ఎస్వీయూను సందర్శించిన యూకే డిప్యూటీ హైకమిషనర్



వర్సిటీ అధికారులతో యూకే డిప్యూటీ హైకమిషనర్

తిరుపతి సిటీ: యునైటెడ్ కింగ్‌డమ్ డిప్యూటీ హైకమిషనర్ విన్ ఓవెన్ మంగళవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించారు. ఆయన ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, భారతీయ పారిశ్రామిక రంగాలతో యూకే బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసేందుకు అంకితభావంతో ఉందన్నారు. ఉమ్మడి పరిశోధన, విద్యామార్పిడి, వాణిజ్య వెంచర్ల కోసం స్పష్టమైన మార్గాలను అన్వేషించడం తన సందర్శన లక్ష్యమని చెప్పారు. ఏపీలో అమలవుతున్న విద్యా విధానం, అభివృద్ధి చెందుతున్న ఐటీ రంగంలో సహాయ సహకారాలకు ఉన్న అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, లక్ష్మి, శ్రీనివాస్, శశికుమార్ పాల్గొన్నారు

మామిడి రైతుకు కూటమి వెన్నుపోటు

మద్దతు ధర అమలులో అంతులేని నిర్లక్ష్యం

- బంగారుపాళెం మామిడి మార్కెట్ యార్డ్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల ధర్నా
- ప్రభుత్వం ప్రకటించిన ధరను అమలు చేయాలని డిమాండ్



బంగారుపాళెం మామిడి మార్కెట్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సునీల్‌కుమార్

బంగారుపాళెం: 'కూటమి ప్రభుత్వం మామిడి రైతునూ వదల్లేదు. ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించి చేతులు పైకెత్తేశారు. దిగుబడి వచ్చినా.. మద్దతు ధరలేక.. రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫ్యాక్టరీల ఎదుట రోజుల తరబడి తిండీ తిప్పలు లేక అల్లాడాల్సి వస్తోంది..' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ ధ్వజమెత్తారు. కిలో మామిడికి రూ.12 లెక్కన మద్దతు ధర ప్రకటించి అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలంటూ మంగళవారం బంగారుపాళెంలోని మామిడి మార్కెట్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధర్నా చేపట్టారు. స్థానిక గ్రామీణ బ్యాంక్ వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా మామిడి మార్కెట్ వరకు ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ చేపట్టారు. అనంతరం మామిడి రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. మామిడి మార్కెట్ యార్డు ప్రధాన గేట్ వద్ద బైఠాయించి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.



ర్యాలీగా వెళ్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మామిడి మార్కెట్ యార్డు వద్ద ఆందోళన

ప్రశ్నిస్తే కేసులా?

ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి రకం మామిడికి గిట్టుబాటుధర లభించక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తోతాపురి కిలో రూ.12 కు కొనుగోలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద టోకన్ల కోసం పడరాని పాట్లు పడి కాయలు కోసి తరలిస్తే రోజుల తరబడి తిండిలేక అవస్థలు పడాల్సి వస్తోందని వాపోయారు. వ్యాపారులు, జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తోతాపురి కిలో రూ.2కు కొనుగోలు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయాందోళనకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల కన్వీనర్లు రామచంద్రారెడ్డి, హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి గోహతిసుబ్బారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకుడు థామస్, మాజీ సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు అరుణామల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, ఎస్సీ, బీసీ, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజ, మొగిలీశ్వర్, షాకీర్, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు విజయకుమార్, బూత్ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రెడ్డి, సోషియల్‌మీడియా వింగ్ అధ్యక్షుడు శైలేష్, మణిరాజ్, నియోజకవర్గ పరిధిలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాత కక్షలతో 108 ఉద్యోగిపై దాడి


విలపిస్తున్న బాధితుడి తల్లి


గాయపడిన నాగరాజు

వి.కోట : పాత కక్షలతో ఓ వ్యక్తిపై పలువురు దాడి చేసిన ఘటన మండలంలోని చింతమాకుల పల్లె పంచాయతీ కాంచిమట్లపల్లెలో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన నాగరాజు(35) 108లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు లక్ష్మీపతి, గణేష్, గంగులప్ప, కుమార్, సుధాకర్, వి.కోటకు చెందిన అశోక్ కలసి మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న నాగరాజుపై మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో నాగరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కుటుంబీకులు హుటాహుటిన 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగేళ్ల క్రితం వారితో నాగరాజు గొడవ పడిన నేపథ్యంలోనే ప్రస్తుతం దాడి చేశారని కుటుంబీకులు ఆరోపించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 84,179 మంది స్వామివారిని దర్శించుకోగా 33,036 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

అంతా మా ఇష్టం.. ధరలు చెప్పం!

జిల్లాలో పళ్ల గుజ్జు పరిశ్రమదారులు సిండికేట్ అయ్యారు. మామిడి రేటును చెప్పకుండా నాన్చుతున్నారు. ఇన్నాళ్లూ రూ.8 నుంచి రూ.5 వరకు పాటపాడారు. తీరా కూటమి ప్రభుత్వం పరువుపోతోందని నోటిమాటగా అమలవుతున్న మద్దతు ధరకు తాళం వేసేశారు. దీని దెబ్బకు రెండు రోజులుగా మామిడిరేట్లు మూగబోయాయి. రైతులకు ఇస్తున్న బిల్లుల్లో తూకం వివరాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ధర వివరాలను ప్రస్తావించకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

జిల్లాలో మ్యాంగో ఫ్యాక్టరీలు సిండికేట్

- ఇన్నాళ్లు తోతాపురి కిలో రూ. 8, రూ.6, రూ.5 అంటూ ప్రచారం
- ప్రస్తుతం ధరలు చెప్పని వైనం
- అయోమయంలో రైతులు




ఫ్యాక్టరీలో మామిడి కాయల క్లీనింగ్ టబ్


గుజ్జు ప్యాకింగ్

కాణిపాకం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇందులో 31 ఫ్యాక్టరీలు తెరుచుకున్నాయి. ఇవీ ఈనెల 6 నుంచి తోతాపురి కొనుగోలును ప్రారంభించాయి. ఫ్యాక్టరీలు తోతాపురి కేజీ రూ.8కి కొనుగోలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తరపున కేజీకి రూ.4 చొప్పున రైతులకు ప్రోత్సాహక నిధి ఇస్తామని పాట పాడింది. ఫ్యాక్టరీలు టోకన్లు జారీచేసి కాయలు కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టాయి. అయితే ఈటోకన్ల జారీ గందరగోళంగా మారడంతో ఫ్యాక్టరీలు చేతులెత్తేశాయి. మధ్యలో పోలీసులు, అధికారులు కల్పించుకుని రైతులందరికీ టోకెన్లు ఇప్పించే ప్రయత్నాలు చేశారు.

కొనేవారేరీ?

టోకన్ల గోల ముదరడంతో అధికారులు కొత్తపల్లవిని అందుకున్నారు. ఇకపై టోకన్లు అవసరం లేదని ప్రకటించారు. కాయలు కోత కోసి ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళితే తీసుకుంటారని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంతో ఫ్యాక్టరీలు కాయలు కొనలేమని బోర్డులు పెట్టేస్తున్నాయి. కాయలు కోసి తెచ్చిన వారిని తిప్పి పంపిచేస్తున్నాయి. లేకుంటే ఐదు రోజుల తర్వాత వరస నంబరు వేసి రైతు ఫలాన్ని మట్టిపాలు చేస్తున్నాయి. సిఫార్సులుంటే అప్పటికప్పుడే దింపుకుంటున్నాయి. మామిడి విపత్తును అదునుగా తీసుకుని ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యాయి. మామిడి రైతులను దెబ్బ తీసేందుకు కుట్రలు పన్నుతున్నాయి.

ధర ఎంత?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 వేల మంది రైతుల వరకు సుమారు 1.5 లక్ష టన్నుల మామిడి కాయలు ఫ్యాక్టరీకి తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో తొలుత వచ్చిన రైతులకు ఫ్యాక్టరీ నిర్వాహకులు తోతాపురి కేజీ ధర రూ.8ని రుచిచూపించారు. కొన్ని రోజుల తర్వాత వచ్చిన రైతులకు కేజీ ధర రూ.6ని తీసుకున్నారు. మరికొన్ని రోజుల తర్వాత వచ్చిన రైతులకు రూ.5ని చెప్పి ముఖం చాటేశారు. ఇప్పుడు ఫ్యాక్టరీలు రైతులకు పెద్ద షాక్ ఇస్తున్నాయి. తోతాపురి ఎంతకు కొనుగోలు చేస్తున్నాయో చెప్పడం లేదు.

గుండె గు'బిల్లు'

ఈనెల 6వ తేదీ నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఏ ఒక్కరైతుకు కూడా బిల్లులో ఫ్యాక్టరీలు ధరల విషయాన్ని ప్రస్తావించ లేదు. కేవలం కాయలు, ట్రాక్టర్ లోడింగ్‌తో సహా ఎంత బరువు ఉంది.. ఖాళీ ట్రక్కుతో ఎంత బరువు ఉంది.. అని మాత్రమే బిల్లుల్లో ప్రస్తావిస్తున్నారు. ధర విషయాన్ని ఖాళీగా చూపుతున్నారు. ధరలు చెప్పకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బారులు తీరిన ట్రాక్టర్లు

గుడిపాల సరిహద్దులోని ఓ ఫ్యాక్టరీ నుంచి తమిళనాడులోని కాట్పాడి కింగ్‌స్టన్ కాలేజీ వరకు మామిడి కాయల ట్రాక్టర్లు క్యూకట్టాయి. గత మూడు రోజులుగా ఈ సమస్య తీవ్రతరమవుతోంది. అన్‌లోడింగ్‌కు రైతులు రోడ్డుపైనే కాపు కాస్తున్నారు. తిండీలేక తిప్పలు పడుతున్నారు. గుడిపాలలోని కొత్తపల్లి వద్ద ఇదే పరిస్థితి ఎదరవుతోంది. జీడీనెల్లూరు మండలం ఎట్టేరి వద్ద ఉన్న ఫ్యాక్టరీ వద్ద కూడా మూడు కి.మీ మేర ట్రాక్టర్లు నిలిచిపోయాయి. ఇక్కడ కాయలు అన్‌లోడింగ్‌కు ఐదు రోజులకు పైనే పడుతోంది. దీని దెబ్బకు ఆయా ఫ్యాక్టరీల నిర్వాహకులు కాయలు కొనలేమని చేతులెత్తేశారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీ సైతం మామిడి కొనుగోలు చేయలేమని బోర్డు పెట్టేస్తున్నాయి. పూతలపట్టు, బంగారుపాళ్యం, తవణంపల్లి, కార్వేటినగరం తదితర ప్రాంతాల్లో కూడా ఈ రకంగా ఫ్యాక్టరీలు రైతులను వేధిస్తున్నాయి.

ధరల బోర్డు పెట్టాలి కదా..?



ఇంత ఘోరం ఎప్పుడూ చూడలేదు. మా కడుపు మంట ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. విధిలేని పరిస్థితుల్లో కాయలు దింపుకుంటే చాలనుకుంటున్నాము. దీన్ని అదునుగా చేసుకుని ఫ్యాక్టరీలు ఇప్పుడు ఎంతకు కొంటున్నాయో కూడా చెప్పడం లేదు. బయట మాత్రం కాయలు కొనలేం.. టోకన్లు ఇవ్వలేమని బోర్డులు పెడుతున్నారు. ధరలపై కూడా బోర్డు పెట్టాలి కదా. దీనిపై అధికారులు కూడా నోరు విప్పడం లేదు.

–గోవర్ధన్, పెనుమూరు మండలం

విద్యను వ్యాపారంగా మార్చేశారు!

– కేశవరెడ్డి పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కేశవరెడ్డి పాఠశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని విద్యాశాఖ అధికారులు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చిత్తూరులోని మురుగానపల్లిలో ఉన్న కేశవరెడ్డి పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. ఆ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని పాఠశాల ఎదుట పెట్టి ధర్నా నిర్వహించారు. బండి చలపతి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి యూనిఫాం, పుస్తకాలను అమ్ముకుంటున్న కేశవరెడ్డి పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులతో పాటు విద్యాసామగ్రిని దోచుకుంటున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చేసిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నా, నాయకులు యోగేష్, నిరంజన్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జల్లించి.. ఎండలో వేసి.. వండి పెట్టేయండి

'జల్లించి, ఎండలో వేసి, వండి పెట్టేయండి.. ఏమీ కాదు' అని నాసిరకం కందిపప్పు సరఫరా చేయడంపై ప్రశ్నించిన అంగన్‌వాడీ కార్యకర్తకు సివిల్ సప్లయిస్ గోదాము అధికారులు చేసిన సూచనలివి. చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడేలా గోదాము అధికారులు నిర్లక్ష్యపు సమాధానమివ్వడంతో నింద్ర మండలం, అత్తూరు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త నివ్వెరపోయారు.



- అంగన్‌వాడీలకు గోదాము అధికారుల సూచన
- చిన్నారులకు.. నాణ్యత లేని ఆహారం
- అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కంది పప్పు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గర్భిణులు, బాలింతలు



పురుగులు పట్టి పిండిలా మారిన కంది పప్పు

తొలిబడి అమ్మ అయితే.. మలిబడి అంగన్‌వాడీ కేంద్రాలే. పిల్లలకు ఆరోగ్యం, పౌష్టికాహారం, భద్రత కల్పించే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలి. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం లేదు. నాణ్యమైన ఆహారం అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పురుగులు పట్టిన కందిపప్పును గర్భిణులు, బాలింతలకు సరఫరా చేస్తున్నారు. ఈ నాసిరకం కందిపప్పునే అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు వండి పెడుతున్నారు.

నగరి: నగరి ఐసీడీఎస్ పరిధిలో 202 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 161 మెయిన్, 41 మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. ఈ సెంటర్లకు నగరి సివిల్ సప్లయిస్ గోదాము నుంచే సరుకులు సరఫరా చేస్తారు. గోదాముకు వచ్చి చేరిన సరుకే నాసిరకంగా ఉంటోంది. దానినే మూడు మండలాల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు. ఈ పురుగులు పట్టిన పప్పునే నింద్ర మండలం అత్తూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసేశారు. పురుగులు పట్టిన పప్పు చూసుకున్న వారు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ చేయాల్సినవారు కాసులకోసం కక్కుర్తిపడి అడ్డదారులు తొక్కుతున్నారంటూ ఆరోపించారు.

సరఫరా ఆపేయమన్నాం

వచ్చిన కందిపప్పు నాసిరకంగా ఉండడంతో సీడీపీఓ గోదాము డీటీని సంప్రదించారని, అలా ఉంటే పప్పు పంపిణీ చేయొద్దని, వాపసు పంపేస్తే వేరే పప్పు ఇస్తామన్నారని సూపర్‌వైజర్ శంకరమ్మ తెలిపారు. దీంతో అందరికీ సరఫరా చేయవద్దని ఆదేశాలు కూడా ఇచ్చామన్నారు. నగరి, విజయపురం మండలాల్లో పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదన్నారు. అయితే విషయం తెలియక నింద్ర మండలం అత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేశారన్నారు. సరఫరా ఆపేయమని వారికి సూచించామని త్వరలో వేరే సరకులు ఇస్తామని ఆమె తెలిపారు.

పర్యవేక్షణ కరవు

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సరుకుల పంపిణీ దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే పప్పును చెరిగితే సగానికి సగం వేస్టేజీ పోతుందని, పప్పు గింజల కంటే ఎక్కువగా పురుగులు ఉంటున్నాయన్నారు. దీనినే కేంద్రంలోని పిల్లలకు కూడా వండిపెడుతున్నారన్నారు. ఇప్పటికే విజయపురం పన్నూరు హాస్టల్‌లో 30 మందికిపైగా పిల్లలు అస్వస్థతకులోనై ఆస్పత్రి పాలయ్యారు. ఆ పరిస్థితి అంగన్‌వాడీ పిల్లలకు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అత్తూరు కేంద్రంలోనే ఆరుగురు గర్భిణులు ఉన్నారు. వారికేమైనా అయితే ఎవరు బాధ్యత తీసుకుంటారని అంతా ప్రశ్నిస్తున్నారు.

మేం చూసుకుంటాం.. నువ్వు నిర్మించుకో!

పలమనేరులో జోరందుకున్న అక్రమ నిర్మాణాలు

- అధికారులు, నేతల అండతో సాఫీగా పనులు
- రాత్రికి రాత్రే వెలుస్తున్న భవనాలు
- నోరుమెదపని మున్సిపల్ అధికారులు


దండపల్లి రోడ్డులో వెలసిన రేకుల షెడ్డు


గతంలో మాజీ మంత్రి హోదాలో అమరనాథ రెడ్డి బీసీ భవన్ కోసం వేసిన శిలాఫలకం

పలమనేరు: 'చూడబ్బా అధికారం మాది. పార్టీ కోసం ఎంతో ఖర్చు పెట్టాం.. ఇప్పుడు సంపాదించుకోకుండా ఇంకెప్పుడు సంపాదించేది. మాకు పైనుంచి ఎలాంటి ఇబ్బందులు లేవు.. నీవు అక్రమ నిర్మాణాలు చేస్కో.. అధికారులు అసలు మాట్లాడరు.. వారికిచ్చేది ఇస్తాం.. ఎవరైనా అడిగితే మేం చూసుకుంటాం..' ఇది పలమనేరు మున్సిపాలిటీలో సాగుతున్న అక్రమ నిర్మాణాల జోరు. ఎక్కడ ఆక్రమణలు జరిగినా మున్సిపల్ అధికారులకు చెప్పి వారి అండతోనే అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. దీన్ని చూసిన జనం వీళ్లేమి నాయకులు సామీ అని ముక్కున వేలేసుకుంటున్నారు.

విలువైన ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు

పట్టణంలోని మదనపల్లి రోడ్డులో చదరపు అడుగు విలువ రూ.4 వేలుగా ఉంది. దీంతో ప్రభుత్వ స్థలాలపై పలువురి కన్ను పడింది. అంబేడ్కర్ విగ్రహానికి కూతవేటు దూరంలోని ప్రభుత్వ స్థలాన్ని గతంలో మాజీ మంత్రిగా ఉన్న అమరనాథ్‌రెడ్డి బీసీ భవన్ కోసం శంకుస్థాపక చేశారు. ఇప్పుడు కూటమి పాలనలో ఈ స్థలాన్ని ఓ వ్యక్తి ఇటీవలే ఆక్రమించుకొని దాంట్లో రేకుల షెడ్డు వేసుకున్నాడు. ఈ విషయం నేతలకు తెలిసే జరిగింది. అధికారులకు సైతం తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆక్రమణకు గురైన ఈ స్థలం విలువ ఇప్పుడు రూ.50 లక్షలకు పైమాటే.


ఏమీ భయపడొద్దు?

పట్టణంలోని మదనపల్లి రోడ్డులో సత్య బిల్డింగ్‌కు ఎదురుగా బసవన్న గుడి వెనుక వైపున్న డ్రైన్‌పై ఓ వ్యక్తి ఇటీవలే రాత్రికి రాత్రే రేకుల షెడ్డును కట్టేశాడు. దీనివెనుక ఆ ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీ నేత హస్తంతోనే ఈ వ్యవహారం సాగినట్టు తెలుస్తోంది. మున్సిపల్ అధికారుల ద్వారా పర్మిషన్ కోసం ఆలయానికి చెందిన వారి ద్వారా ఆరు నెలల ఖాళీస్థలం లీజు అగ్రిమెంట్ రాయించుకొన్నట్టు తెలిసింది. దీన్ని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు చూపెట్టి ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు చెల్లించేందుకు ప్లాన్ చేసినట్టు సమాచారం. దీనిపై పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. మూడు రోజులు మూతబడిన ఈ అక్రమ దుకాణం తాజాగా తెరుచుకుంది. మున్సిపల్ అధికారులు సైతం అధికారపార్టీ నేతలకు తలొగ్గి దీన్ని పట్టించుకోలేదు. ఓ కీలక నేత తానున్నానంటూ ముందుండి మళ్లీ దీన్ని ప్రారంభించడం గమనార్హం.

దండపల్లి రోడ్డులో ఇదేతంతు

మున్సిపాలిటీ పరిధిలోని దండపల్లి రోడ్డులో ఓ కూటమి నేత ఇటీవలే తనకు పట్టా ఉందని ఓ రేకుల షెడ్డును నిర్మించాడు. గతంలో నాగమణి అనే తహసీల్దార్ విధుల్లో ఉన్నప్పుడు భాను అనే వ్యక్తి పట్టణంలో పలు నకిలీ ఇంటిపట్టాలను భారీగా డబ్బు వసూలు చేసి విక్రయించేశాడు. ఇలా పట్టాలు పొందిన వాళ్లు గత ఎన్నికల్లో కూటమి పార్టీలో చేరి వారుపొందిన పట్టాల్లో మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై మున్సిపల్ టీపీఎస్ ఇందిరను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా పట్టణంలో ఆక్రమణ విషయాలు తన దృష్టికి రాలేదని చెప్పారు.


బీసీ భవన్ స్థలాన్ని కాపాడండి



గతంలో అమరన్న మాజీ మంత్రిగా ఉన్నప్పుడు మదనపల్లి రోడ్డులో బీసీ భవన్ నిర్మాణానికి స్థలమిచ్చి అక్కడ భవన నిర్మాణానికి శంకుస్థాపక కూడా చేశారు. ఆపై వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ఈ పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనైనా బీసీ భవన్ నిర్మిస్తే నియోజకవర్గంలోని బీసీలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– పూసల రవి, రాష్ట్ర బీసీ నేత, పలమనేరు

డబ్బులిస్తే షెడ్డు వేసుకోవచ్చా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ వాళ్లు ఎలా డబ్బులు సంపాదించుకోవాలే పనిలో పడ్డారు. గంగవరంలో రాముని పేరి ట ఉన్న స్థలాన్ని విక్రయించేందుకు చూశారు. ఇక మదనపల్లి రోడ్డులో పచ్చ నేతలు డబ్బులు తీసుకొని అక్రమ నిర్మాణాలను చేస్తున్నారు. మున్సిపల్ ఆఫీసు ఆక్రమించుకొని షెడ్డు వేసుకున్నా పట్టించుకోరా..?

– ఎన్.వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ స్టూడెంట్స్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో జూలై 6న ఎంఆర్ఎఫ్ సంస్థ నిర్వహించనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను మంగళవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆవిష్కరించారు. డిప్లొమో, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రొఫెసర్ మురళీధర్, డాక్టర్ పతిపాటి వివేక్, ఎంఆర్ఎఫ్ ప్రతినిధి వెంకటరమణ పాల్గొన్నారు.